భక్తిశ్రద్ధలతో రాజశ్యామల యాగం



పూజలు చేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఆదివారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి–షాలిని దంపతులు మహా గణాధిపతి, రాజశ్యామల, చండీ సుదర్శన కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌశిక్‌రెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు గందె రాధికశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్ దంపతులు, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ఎరుకలకు గుర్తింపు



మాట్లాడుతున్న లోకిని రాజు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎరుకల కులస్తులకు సరైన గుర్తింపు లభించిందని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు అన్నారు. పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ ఎరుకల కులస్తులను గుర్తించి హైదరాబాద్ కేంద్రంగా ఎకరం భూమి, రూ. ఐదుకోట్ల నిధులు ఇచ్చి ఎరుకల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించారని, రాష్ట్ర వ్యాప్తంగా పందులపై ఆధారపడి జీవిస్తున్న ఎరుకల జాతి ఉద్ధరణ, వారి కుటుంబాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీమ్ ఏర్పాటు చేసి రూ. 60 కోట్లు కేటాయించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. హైదరాబాదులోని కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోతాటి రామన్నకు అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుతాడి తిరుపతి, ఉపాధ్యక్షుడు తిరుపతి మొండయ్య, నాయకులు కుతాటి తిరుపతి, అంగడి రమేశ్, రేవల్లి తిరుపతి, కుతాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌రూరల్: ప్రజలు మార్పు కోరుకుంటున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం హుస్నాబాద్ ఎలా ఉందో ప్రస్తుతం అలాగే ఉందని అన్నారు. వానొస్తే ప్రధాన రోడ్డులోని దుకాణాలకు వరద నీరు వస్తోందని వాపోయారు. అసమర్థ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు హుస్నాబాద్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచనే లేదని ఆరోపించారు. గజ్వేల్, సిద్దిపేటలో అభివృద్ధి జరిగినట్లు హుస్నాబాద్‌లో ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం పట్టణంలోని ముదిరాజ్, హమాలీ సంఘం నాయకులతో మాట్లాడి మద్దతు ఇవ్వాలని కోరారు. పొన్నం ప్రభాకర్‌కు మద్దతుగా తీన్మార్ మల్లన్న ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ నాయకుడు కేడం లింగమూర్తి, కౌన్సిలర్ చిత్తారి పద్మ రవీందర్, నాయకులు వల్లంపు రాజు, మంజులారెడ్డి, బంక చందు తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి: మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లో ప్రచారం చేస్తున్న పొన్నం

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

ఎల్కతుర్తి: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ప్రజలు చూస్తున్నారని పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండలంలోని దామెర, చింతలపల్లి, శాంతినగర్, ఎల్కతుర్తి మండలంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హుస్నాబాద్‌ను సెంటిమెంట్‌గా భావిస్తాడు గానీ నియోజకవర్గాన్ని అభివృద్ధి మాత్రం చేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పొన్నం ప్రభాకర్ పోరాటం చేశారని కొనియాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని విమర్శించారు. గౌరవెల్లి భూనిర్వాసితులు పరిహారం కోసం న్యాయ పోరాటం చేస్తే వారిని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ జైలులో పెట్టించారని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి రాములు, రాజేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, సంతాజీ, శ్రీకాంత్, సుమన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం



సమ్మయ్య

జమ్మికుంట: ఎరుకల ప్రజాసమితి జమ్మికుంట మండల అధ్యక్షుడిగా మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన పల్లకొండ సమ్మయ్యను ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కెంసారపు తిరుపతి ఆధ్వర్యంలో ఎన్నికున్నామని సమితి నాయకులు తెలిపారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుర్ర ఎల్లస్వామి, ప్రధాన కార్యదర్శిగా పల్లకొండ అశోక్, ఉపాధ్యక్షులుగా దుగ్యాల రాజయ్య, కుర్ర తిరుపతి, సహాయ కారదర్శులుగా దుగ్యాల గంగయ్య, కుర్ర కుమారస్వామి, దుగ్యాల ఎల్లయ్యతో పాటు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ... ఎన్నికకు సహకరించిన ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమితి బలోపేతానికి కృషి చేస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉండాడి వెంకటేశ్, జిల్లా నాయకులు బిజిలి శ్రీను, మొగిలి, శేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న వడ్లూరి వాసు

హుజూరాబాద్‌రూరల్: ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత హుజూరాబాద్‌ను అంబేడ్కర్ జిల్లాగా ప్రకటించాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. పట్టణంలో ఆదివారం మాట్లాడారు. చుట్టూ ఉన్న మండలాలతో పాటు వావిలాల, చల్లూరు, ఉప్పల్‌ను కొత్త మండలాలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దళిత రత్న అవార్డు గ్రహీత సరిగొమ్ముల మనోహర్, నాయకులు రమేశ్‌బాబు, కుమార్, అనసూర్య, రాకేశ్,అమ్జద్, బద్రీ, సోమిడి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



ఇల్లందకుంట: ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని కాంగ్రెస్ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి నివాసంలో ఆదివారం దివంగత, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల ప్రణవ్ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలు కొనియాడారు. ఈకార్యక్రమంలో రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటేసి హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఠాకూర్ నరేందర్ సింగ్, రానా ప్రతాప్‌సింగ్, షాబుద్దీన్, బోయిని వేణు, పలువురు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ మండల మహిళా కార్యకర్తలు చిగురుమామిడిలో ఇంటింటా ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటేసి పొన్నంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పోలు స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంగిలే రామారావు అన్నారు. మండల కేంద్రంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ చైర్మన్ చైర్మన్ మల్లేశ్, కిరణ్, ఓదెలు, దేవేందర్, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న వొడితెల ప్రణవ్



చిగురుమామిడి: నవాబుపేట్‌లో...

పుస్తెమెట్టెల అందజేత

గన్నేరువరం: కరీంనగర్ డెయిరీ సభ్యురాలు, మాదాపూర్‌కు చెందిన మాడుగుల పద్మ కూతురు ప్రియాంక వివాహానికి డెయిరీ గ్రామశాఖ అధ్యక్షుడు బండి తిరుపతి, రూట్ సూపర్‌వైజర్ గాజుల లక్ష్మీనర్సయ్య ఆదివారం హాజరై పుస్తెమెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాజిరెడ్డి, బాలయ్య(గద్దర్), నూనె రాజేందర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కట్ట రాజయ్య, జెల్ల పోచమల్లు, కత్తి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పుస్తెమెట్టెలు అందజేస్తున్న డెయిరీ సభ్యులు

హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని గద్దెదించాలి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న కవ్వంపల్లి

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: బంగారు తెలంగాణ చేస్తానని సీఎం కేసీఆర్ మాట తప్పాడని, హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఓటర్లను కోరారు. మండలంలోని గంగిపల్లి, కొండపల్కల గ్రామాల్లో ఆదివారంఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం, దళితులకు మూడెకరాలు, దళితబంధు, బీసీబంధు, ఉద్యోగవకాశాలు కల్పిస్తామని ప్రజలను మోసగించిందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఏ పథకం పట్ల ప్రజలు సంతృప్తికరంగా లేరని, పథకాల్లో చాలా అవినీతి జరిగిందని, గెలవడానికి ఒక హామీ, గెలిచిన తర్వాత మరో హామీ ఇచ్చి మోసం చేశారని, రసమయి బాలకిషన్ ఆటపాటలతోనే ప్రజలను సంతోష పెడుతున్నాడని ఆరోపించారు. మరోసారి బీఆర్‌ఎస్ గారడి మాటలు నమ్మవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, హస్తం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రవీంద్రాచారీ, ఎంపీటీసీ చలిగంటి సంపత్, సొసైటీ డైరెక్టర్ వాల అంజుత్‌రావు, నాయకులు తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు దూలం దేవేంద్ర వీరస్వామి, మాజీ సర్పంచ్ నాగిశెట్టి రాజయ్య, కాటం కనకయ్య, నల్లగొండ రాములు, ముక్కెర సతీశ్, రామకృష్ణ, రమేశ్, దేవదాసు, మాడ రాజిరెడ్డి, తోట శ్రీనివాస్, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, దూలం మణికంఠస్వామి, గాజుల తిరుపతి, శివారెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కులేదు

- కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/సైదాపూర్/ఇల్లందకుంట: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా విస్మరించిన బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓటు అడిగే నైతిక హక్కులేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని కాంగ్రెస్ నా యకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తమ్మేటి సమ్మిరెడ్డి ఇంటి ఆవరణలో మండలంలోని వావి లాల, జగ్గయ్యపల్లి, వంతడుపుల, జమ్మికుంట పట్టణానికి చెందిన 150 మందిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే, ఎవరికి ఓటు వేసిన ప్రజలకు మేలు జరగదన్నారు. సైదాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై నాయకులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. పదేండ్లలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గ్రామాల్లో పైసా పని చేయలేదని, మౌలిక వసతులు కల్పించలేదని, డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని ప్రణవ్ అన్నారు. ఇల్లందకుంట మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రజలను మభ్యపెడుతూ వస్తుందన్నారు. హుజూరాబాద్‌రూరల్ మండలం సింగాపూర్ గ్రామంలో ప్రణవ్ సమక్షంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి మహేందర్‌గౌడ్, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గుడ్డేలుగుల ప్రదీప్ కాంగ్రెస్‌లో చేరారు.ప్రణవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ప్రణవ్



ఎన్నికల నిర్వహణకే ఉపయోగం

కరీంనగర్ మండలం తాహెర్‌కొండాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం కేవలం ఎన్నికల నిర్వహణకు మాత్రమే ఉపయోగపడుతోంది. విద్యార్థులందరూ ప్రైవేట్ పాఠశాలలకు పోవడంతో పదేళ్ల క్రితం ఈ పాఠశాలను అధికారులు మూసివేశారు. 2019లో కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయగా నాలుగేళ్లపాటు పంచాయతీ కార్యాలయంగా వినియోగించారు. గతేడాది కొత్త పంచాయతీ భవనం నిర్మించడంతో పాఠశాల మళ్లీ నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి 95 నంబరు కేటాయించారు. – కరీంనగర్‌రూరల్

చెత్త తొలగిస్తేనే నీటి పారకం

- ఎస్సారెస్పీ కాకతీయ ఉపకాలువల్లో పేరుకుపోతున్న మట్టి, చెత్తాచెదారం
- యాసంగి సాగుకు నీరు అందేనా..?
- ఆందోళనలో అన్నదాతలు
- ఉపాధి కూలీలతో కాలువలు శుభ్రం చేయించాలని డిమాండ్



పూడిక, పిచ్చిమొక్కలతో ఆనవాళ్లు కనిపించకుండా అధ్వానంగా డీబీఎం 3 ఉపకాలువ

మానకొండూర్: ఎస్సారెస్పీ కాకతీయ ఉపకాలువల్లో చెత్తాచెదారం, పూడిక పేరుకుపోతూ అధ్వానంగా మారుతున్నాయి. కాలువల్లో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోతుండటంతోరబీలో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

మూడు మండలాల పరిధిలో...

మానకొండూర్ నియోజకవర్గంలోని తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం మండలాల గుండా ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా సాగు భూములకు నీరు అందుతోంది. కాలువకు 14 ఉప కాలువలు ఉన్నాయి, ఈ ఉప కాలువల ద్వారా మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం, వీణవంక మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు వెళుతోంది. వేలాది ఎకరాలకు కాలువల ద్వారా వచ్చే నీరే సాగుకు ఆధారం. రబీలో నీరు అధికంగా అవసరమవుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉపకాలువల్లో చెత్తాచెదారం, పూడిక చేరింది. కాలువలు శుభ్రం చే యిస్తే తప్పా సాగునీరు అందేలా లేదని వాపోతున్నారు.

కూలీలతో పూడిక తొలగించాలి

కాలువల్లో ఉపాధి హామీ కూలీలతో పూడిక తీయించేందుకు ఇదే మంచి సమయమని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరికోతలు కూడా పూర్తికావడంతో కూలీ పనులకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని, కాలువలు శుభ్రం చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాలువల్లో ఎక్కడెక్కడ పూడిక పేరుకుపోయిందో తమ దృష్టికి రాలేదని ఉపాధిహామీ అధికారులు చెబుతున్నారు. ఎస్సారెస్పీ అధికారులు ప్రతిపాదనలు పంపాలంటున్నారు. మానకొండూర్ మండలంలోని డీబీఎం 2, 3, 10 కాలువల్లో పూడిక పేరుకుపోయిందని, నీరు వదిలితే కాలువ చివరి వరకు సాగునీరు వెళ్లకుండా మధ్యలోనే గండి పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూడిక తొలగించాలి



కాలువల్లో పూడిక చాలా ఉంది. కాలువల ద్వారా వచ్చే సాగునీరు మెల్లగా వెళ్తోంది. రబీలో కాలువ కింది పొలాలకు సాగునీరు చాలా అవసరం అయితే పూడిక తొలగిస్తే ఇబ్బంది ఉండదు. మట్టి, చెత్తా, చెదారం తొలగించాలి.

– వెన్నం మహేశ్, గట్టుదుద్దెనపల్లి

కూలీలతో తీయించాలి



చాలా రోజులుగా కాలువల్లో మట్టి ఉంది. ఉపాధి హామీ కూలీలతో మట్టిని తీసేస్తే సాగునీరు పరుగులు తీస్తుంది. భూములకు సరిపడా నీరు అంది పంటలు ఎండిపోకుండా ఉంటాయి. అధికారులు పూడికతీత చర్యలు చేపట్టాలి.

– మడ్డి చంద్రయ్య, గట్టుదుద్దెనపల్లి

ప్రతిపాదనలు రావాలి

కాలువల్లో ఎక్కడెక్కడ పూడిక, చెత్తాచెదారం ఉంది, దానికి సంబంధించిన ప్రతిపాదనలు ఎస్సారెస్పీ అధికారులు చెప్పగానే పనులు ప్రారంభిస్తాం. ఉపాధిహామీ జేఈలతో పూడిక ఎక్కడెక్కడ పేరుకుపోయిందో తెలుసుకుంటాం. గతంలో చాలా చోట్ల కూలీలతో కాలువలు శుభ్రం చేయించాం. రబీలో సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఏపీవో

కారు–బైక్ ఢీ

శంకరపట్నం: మండల కేంద్రానికి చెందిన యువకుడు ధీరజ్ ఆదివారం బైక్‌పై వెళ్తుండగా కేశవపట్నం అంబేద్కర్ విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ధీరజ్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.